## సింగిల్ పేజీ కథలు

# దైవలీల

**క**రతాళ ధ్వనులతో స్టేడియం మారుమ్రోగిపోయింది.

"కంగ్రాట్స్ మయూరి. నిజంగా నాట్య మయూరివ నిపించుకున్నావు" పొగడ్తలతో ముంచెత్తారు ఫ్రెండ్స్. ఆనాటి కళాశాల వార్షికోత్సవ ప్రోగ్రాంలో మయూరి నాట్యమే హైలైట్.

***

"నీవు పుస్తకాల పురుగువనే సంగతి మాకు తెలుసులే గురూ. అయినా జీవితమంటే పుస్తకాలు చదవడమేనా? ముందు ముందు జీవిత సుడిగుండం ఉండనే వుంది. అప్పుడెలాగూ సుఖపడలేం. ఇప్పుడైనా కనీసం ఓ చిన్న వినోదం కూడా లేకపోతే ఏం బ్రతుకులు బాబూ" గొణుగుతూనే ఉన్నాడు వినోద్.

"అర్ధగంట నుంచి చూస్తున్నా. ఏంటిరా నీ సణుగుడు. అసలు నీకేం కావాలో చెప్పి ఏడ్వవచ్చు కదా" అంటూ పుస్తకం పక్కన పెట్టాడు దివాకర్.

"హమ్మయ్య. ఇప్పుడు మా లోకంలోకి వచ్చావన్నమాట. ఈ రోజు రవీంద్ర భారతిలో ప్రఖ్యాత నర్తకి శోభనగారి నాట్య ప్రదర్శన ఉందన్న సంగతే మర్చిపోతే ఎలా? నీవు చెప్పావనే కదా టిక్కెట్స్ రిజర్వు చేయించింది. ఇప్పుడేమో బుద్ధుడిలా పుస్తకంలో లీనమైతే నా గతేం కావాలి" అన్నాడు వినోద్.

"నీకసలు బుద్ధుందా. ఆ మాట ఇప్పుడా చెప్పడం. ఉండు పది నిముషాల్లో ఫ్రెషప్ అయి వస్తాను" అంటూ బాత్రూంలో దూరాడు దివాకర్.

"వీడిని ఏ మహాతల్లి కట్టుకుంటుందో గానీ ఆవిడగారి పని గోవిందా" చిన్నగా నవ్వుకున్నాడు వినోద్.


చిన్నప్పటినుంచీ ఇద్దరిదీ విడదీయరాని స్నేహం. వినోద్ తండ్రి దివాకర్ తండ్రిలా ధనవంతుడు కాకపోయినా కొంతవరకు స్థితిమంతుడే. ఆర్థిక ఇబ్బందులున్నా వినోద్ కోరిక కాదనలేకపోయాడు తండ్రి. ప్రస్తుతం మిత్రులిద్దరూ మెకానికల్ ఇంజనీరింగ్ చేస్తున్నారు.

నాట్యమంటే ఎంతో ఇష్టపడేవాడు దివాకర్. తండ్రి వద్దన్నా వినకుండా నాట్యం నేర్చుకోబోయి కిందపడి కాలుకు దెబ్బ తగిలించుకున్నాక ఆ కోరిక వదిలేసాడు. "నాట్యం నేర్చుకోకపోయినా నాట్యం నేర్చిన అమ్మాయినైనా జీవిత భాగస్వామిగా చేసుకోవాలి. ఆమె నాట్యాన్ని చూస్తూ నా కోరిక తీర్చుకోవాలిరా" అనేవాడు దివాకర్.

* * *

"మదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మిడియట్లీ" టెలిగ్రాం అందుకున్న దివాకర్ కొయ్యబారిపోయాడు.

"ఆంటీకి ఏమీ జరిగి ఉండదు. నీవేం బెంగపడకు" మిత్రుడికి ధైర్యం చెప్పాడు వినోద్. దివాకర్‌తోపాటు తాను కూడా బస్సెక్కాడు.



"మేడ దిగుతూ మెట్లపైనుండి జారి పడింది. తలకు బలంగా దెబ్బ తగలడంతో ఆసుపత్రికి తీసుకెళ్లాం. ఇవాళో రేపో అంతే. లాభం లేదన్నారు డాక్టర్లు. దాంతో నీకు టెలిగ్రాం ఇచ్చాం" కొడుకును కౌగలించుకుని భోరున ఏడ్చాడు దివాకర్ తండ్రి.

"ధైర్యం చెప్పాల్సిన మీరే ఇలా ఏడిస్తే ఎలా అంకుల్" అంటూ ఎలా ఓదార్చాలో తెలియక అయోమయంగా నిలబడ్డాడు వినోద్.

"బాబూ దివాకర్! రేఖను ఈ ఇంటి కోడలిగా చేసుకుంటానని నాతో మాట తీసుకుని చనిపోయిందిరా మీ అత్తయ్య. నీవు మా మాటను కాదనవనే నమ్మకంతో నేను మీ నాన్న ఈ విషయం ఇంతకాలం నీకు చెప్పలేదు. రేఖ అన్నివిధాలా నీకు తగిన పిల్ల. నా కోరికను తీర్చి మా మాట నిలబెడతావు కదూ" అంటూ ఆప్యాయంగా కొడుకు చేతిని పట్టుకుని ప్రాణం వదిలింది తల్లి.

* * *

దివాకర్, రేఖ దంపతులయ్యారు.

"రేఖా! నీకు నాట్యం వస్తుందా?" దివాకర్ రేఖతో మాట్లాడిన మొట్టమొదటి మాట ఇది. వస్తుందనే అంటుందేమో అని ఆశగా చూసాడు దివాకర్.

తల అడ్డంగా తిప్పిన రేఖను చూసి నిరాశపడ్డాడు.

కాలగర్భంలో ఐదేళ్ళు గడిచాయి. తండ్రి చేస్తున్న వ్యాపారంలోనే తాను కూడా స్థిరపడ్డాడు దివాకర్. ఇన్నాళ్లకు తాను కూడా తండ్రిని కాబోతున్నానని తెలిసి చాలా సంతోషించాడు.

"కంగ్రాట్స్ సార్! మీకు అమ్మాయి పుట్టింది. మీరు వెళ్లి చూడవచ్చు" నర్సు మాటలు వీనులవిందుగా వినిపించాయి. తన వంశాంకురాన్ని, తనను తండ్రిని చేసిన భార్యను ఆనందంగా చూసాడు దివాకర్.

"ఏమండీ! అమ్మాయి బాగుందా. నేను నాట్యం నేర్చుకోలేకపోయాను. కానీ మన అమ్మాయికి నేర్పిద్దాం. అలాగైనా మీ కోరిక తీర్చుకుందురుగానీ" భర్త చేతిని పట్టుకుని ఎంతో నమ్మకంగా పలికింది రేఖ.

అంతలోనే బాధతో మెలికలు తిరిగిపోసాగింది. డాక్టర్ కోసం పరుగులు తీసింది నర్సు. భర్త చేతిని వదలకుండా ఏమో చెప్పాలని ప్రయత్నం చేస్తూ డాక్టర్ వచ్చే లోపునే ప్రాణం వదిలింది రేఖ.

***

కూతురికి మయూరి అని నామకరణం చేసాడు దివాకర్. మయూరిలోనే భార్యను చూసుకుంటూ అపురూపంగా పెంచాడు. చదువుతోపాటు నాట్యం కూడా నేర్పించాడు. చిన్నప్పటినుంచీ నాట్యంలో ఎన్నో బహుమతులు సంపాదించింది. ఈ రోజు కళాశాల వార్షికోత్సవంలో అందరి ప్రశంసలు అందుకుంది. తన కోరికను నెరవేర్చిన కూతురిని చూస్తూ దివాకర్ మనస్సు హర్షాతిరేకంతో పులకించింది.

జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరిగే నాట్య ప్రదర్శన

పోటీకి మన రాష్ట్రం నుండి ఎన్నికయింది మయూరి. తన జీవితానికే వన్నె తెచ్చే అవకాశమిది. తండ్రితో కలసి ఢిల్లీకి బయలుదేరింది.

తండ్రికి గుడ్‌నైట్ చెప్పి పడుకుంది మయూరి.

రాత్రి రెండుగంటల సమయం. ఉలిక్కిపడి లేచాడు దివాకర్. వణుకుతూ మూలుగుతోంది మయూరి.

"వాతావరణం మారినందువల్ల జ్వరం వచ్చింది. భయపడవలసింది ఏమీలేదు. ఉదయానికంతా మామూలుగా వుంటుంది" అంటూ మందులిచ్చి వెళ్లాడు డాక్టర్.

జ్వరం తగ్గిపోయింది. కానీ నీరసంగా వుంది. ఈ స్థితిలో నాట్యం చేయడం అసాధ్యం.

తాను కట్టుకున్న ఆశాసౌధం తన కళ్లముందే కూలిపోతుంటే తట్టుకోలేకపోయింది మయూరి. తండ్రిని పట్టుకుని భోరున ఏడ్చింది. తాను నమ్మిన దైవాన్ని కసిదీరా తిట్టుకుంది.

"కారణం లేకుండా ఏదీ జరగదు మయూరి. అయినా ఇప్పుడేమయిందని? నీ ఆరోగ్యం కుదుటపడనీ. ఈ అవకాశం తప్పిపోయినా మరో ఛాన్సు రాకపోదు. ఏ నాటికైనా నీ కోరిక నెరవేరుతుంది. అయితే కాస్త ఆలస్యం కావచ్చు. అంతే" కూతురికి ధైర్యం చెప్పాడు దివాకర్.

టీవీలో వార్తలు వింటూ మగతగా కళ్ళు మూసుకుంది మయూరి.

"ఇప్పుడే అందిన వార్త. ఈ రోజు నగరంలో జాతీయ నాట్య ప్రదర్శన జరుగుతున్న స్టేడియంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌వల్ల స్టేడియం మొత్తం అగ్నికి ఆహుతి అయింది. ప్రాణనష్టం ఎక్కువగానే వుంటుందని, అందులో ఎక్కువగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నర్తకీమణులే ఉంటారని అంచనా. పూర్తి వివరాలు అందవలసి వుంది"

తండ్రీ కూతుళ్లిద్దరూ నిశ్చేష్టులయ్యారు.

"ఎంతో ఆరోగ్యంగా వున్న నీకు జ్వరం రావడమేమిటా అని నేను కూడా దైవాన్ని నిందించాను. రాబోయే ప్రమాదాన్ని దేవుడు ఎలా తప్పించాడో చూసాక దైవలీలలు ఎంతో విచిత్రంగా వుంటాయనిపిస్తోంది కదూ" అన్నాడు దివాకర్.

'నీ మహిమలు తెలియక తిట్టిన నా తప్పును మన్నించు స్వామీ' మనస్సులోనే దేవునికి ప్రణతులర్పించింది మయూరి.

**- టి.రామాంజనేయులు (హొలహర్వి)**

# వజ్రాయుధం

**"సుశీ! రేపు సెలవు పెట్టగలవా? సరదాగా షాపింగ్‌కి వెళదాం" అడిగాడు శ్రీరామ్ భార్య సుశీలని.**

"ఓ తప్పకుండా" అంది సుశీల.

"మీ బాస్ నీకు సెలవిస్తాడంటావా?" అన్నాడు శ్రీరామ్.

"అడిగేవిధంగా అడిగితే అతనే ఇస్తాడు" అని ధీమాగా జవాబిచ్చింది సుశీల.

* * *

టైం తొమ్మిదైంది. ఆఫీసుకి ఒకరొకరూ వస్తున్నారు. అరగంట ముందునుండి బాస్ కోసం టెన్షన్ పడుతూ వెయిట్ చేస్తున్నాడు పరమేశం. పదయ్యేసరికి బాస్ వచ్చారు. బెదురుబెదురుగా ఛాంబర్‌లో అడుగుపెట్టి విష్ చేశాడు పరమేశం.

"ఏమిటోయ్ పొద్దున్నే ఊలావడ్డ మొహంతో తగలడ్డావ్" చిరాగ్గా అడిగాడు బాస్ పరమేశాన్ని.

అతనిలోని వినయాన్ని గమనించిన పరమేశానికి నిరాశ ఆవహించింది. అయినా ఓ ప్రయత్నంగా "సార్ మా మదర్‌కి సీరియస్‌గా ఉందని..." అభ్యర్థన పూర్తవకముందే అందుకున్నాడు బాసు.

"మదర్‌కి సీరియస్. ఫాదర్‌కి సెరిబ్రల్. అంటూ ఏవేవో సాకులు చెప్పి సెలవులు అడగడం అలవాటైపోయిందయ్యా మీకు. సెలవూ లేదు గిలవూ లేదు పో. పోయి నీ పనిచూసుకో" బాస్ కయ్‌మన్నాడు.

"నిజంగానే సార్. ఇప్పుడే కబురొచ్చింది. హాస్పిటల్‌లో జాయిన్ చెయ్యాలి" దీనవదనంతో చూస్తూ చెప్పాడు పరమేశం. "ఆ ఎవరో ఒకరు జాయిన్ చేస్తార్లే. సాయంత్రం మూడుగంటలకు పర్మిషన్ ఇస్తాను వెళ్ళు"

"ఎవరూ లేరు సార్. నేనే..."

"ఆ నువ్వే వెళ్ళాలి అంటావ్. నువ్వే వెళ్లొద్దు అంటాన్నేను. రేపు ఇన్‌స్పెక్షన్ ఉంది. ఫైల్సు, రికార్డులు అప్‌టు డేట్‌గా ఉండాలి. పెండింగ్ ఏమైనా ఉన్నాయేమో చూసి పూర్తిచెయ్. మరెక్కడ నిలబడకు వెళ్ళు" అరిచాడు బాసు.



చేసేదిలేక బయటపడ్డాడు పరమేశం.

ఏ ఫైల్ తీసినా తన తల్లి రూపమే కనిపిస్తోందతనికి. తల్లిని చూడాలన్న ఆరాటానికి అడ్డుకట్ట వేసి అన్యమనస్కంగా పనిచేసుకుపోతున్నాడు పరమేశం. సహోద్యోగుల ఓదార్పు కొంత బలాన్నివ్వడంతో దుఃఖాన్ని దిగమింగి పెండింగ్ ఫైల్స్ పూర్తిచేసి నాలుగున్నరకు తల్లిని చూడడానికి వెళ్లగలిగాడు.

* * *

టైం సరిగ్గా అయిదయింది. ఒక్కొక్కరూ ఆఫీసు విడిచి ఇంటి ముఖం పడుతున్నారు. బాస్ ఛాంబర్‌లో అడుగుపెట్టింది సుశీల.

"గుడ్‌ఈవెనింగ్ సార్" అంది.

"ఆ ఏంటి" తలెత్తకుండానే అన్నారు బాస్.

"రేపు సెలవు కావాలి సార్" అడిగింది సుశీల.

"నో...నో... రేపు సెలవు ఇవ్వడం కుదరదు. ఇన్‌స్పెక్షన్ ఉంది"

"చాలా అర్జంట్ పనిసార్" అంది సుశీల.

"అందరికీ అర్జెంటే. అన్నీ అర్జెంట్లే. ఆఫీసు పని ఇంకా అర్జెంట్. రేపు మీరు వచ్చి తీరాలి" బాస్ చిరాగ్గా అరిచారు.

ఓ అరనిముషం పాటు రూమ్‌లో నిశ్శబ్దం. సుశీల నీళ్ళకుండ బద్దలైపోయింది. బాస్ తలెత్తి చూసేలా చిన్న శబ్దంతో ముత్యాలు ఎగజిమ్ముతోంది. ఆ శబ్దం బాస్‌లో చైతన్యానికి నాంది పలికింది. తలెత్తి ఆమెవైపు చూశాడు. వస్తున్న నీళ్ళధార బాస్ రాతి గుండెని కరిగించింది.

చిన్న నవ్వు నవ్వుకుంటూ కళ్ళు తుడుచుకుంటూ బయటికొచ్చింది సుశీల విజయోత్సాహంతో.

**- కె.వి.సన్యాసిరావ్ (అలమండ)**